## క్లుప్తంగా

### ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి



జ్ఞానేశ్వర్‌ను సన్మానించిన ముదిరాజ్ సంఘం మండల సభ్యులు, పక్కన నీలం మధు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొర్ర జ్ఞానేశ్వర్‌ను మండల ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘాల అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రాజు, మహేందర్‌ముదిరాజ్, సురేష్, సిద్ధేశ్వర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు



గుంతల్లో మట్టిని పోయిస్తున్న సీఐ వెంకటేశం

శంకర్‌పల్లి: పట్టణంలో రోడ్డుపై పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడం.. రాత్రి వేళ వాటిని అంచనా వేయలేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారు. దీంతో సోమవారం పోలీసులు సామాజిక బాధ్యతగా రంగంలోకి దిగారు. ఫత్తేపూర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ సీఐ వెంకటేశం మొరం వేసి, పూడ్చి వేయించారు. దీంతో వాహనదారులు పోలీసులను అభినందిస్తున్నారు.

### సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

- కౌన్సిలర్ శాంతమ్మ



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్

షాద్‌నగర్: వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తునట్లు కౌన్సిలర్ శాంతమ్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాలనీలో ప్రజలకు విద్యుద్దీపాలు, డ్రైనేజీలు, మంచినీరు, సీసీ రోడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శైలజ, సుధీర్, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేష్, రాఘవేందర్, కాటసుధీర్, కార్తీక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండలంలోని లింగంధనలో మృతి చెందిన బంటు లక్ష్మమ్మ అంత్యక్రియలకు సోమవారం నాయకులు సహాయం అందించారు. మాజీ జెడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి ఒక్కొక్కరు రూ.ఐదు వేల చొప్పున ఇచ్చారు. అదే విధంగా సుదర్శన్, తిరుపతిరెడ్డి, ప్రతాప్ ఒక్కొక్కరు రూ.రెండు వేల చొప్పున నగదు అందజేశారు.

**ఆడబిడ్డ జన్మించినందుకు..**

షాబాద్: మండలంలోని తిర్మలాపూర్‌లో ఆడబిడ్డ జన్మించినందుకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి సదరు దంపతులకు సోమవారం రూ.5,211 నగదు అందజేశారు. ఇప్పటివరకు 15 మంది మహిళలకు సాయం చేసినట్లు ఆయన తెలిపారు.

### భక్తులకు అన్నదానం

మహేశ్వరం: మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం శివపార్వతులకు అభిషేకం, హారతి, పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్‌లు భక్తులకు అన్నదానం చేశారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కేఎల్లార్ పేర్కొన్నారు. అతి పురాతన శివాలయం మహేశ్వరం మండల కేంద్రంలో కొలువుతీరడం ఈ ప్రాంతవాసులకు అదృష్టమన్నారు.

# రైతు బీమా.. కొండంత ధీమా

అరుగాలం శ్రమించి మట్టి నుంచి సిరులు పండించే అన్నదాతలకు అనుకోని ఉపద్రవం ఎదురైతే ఆ కుటుంబం కకావికలం అవుతుంది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం 'రైతు బీమా' పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సర్కారు సైతం యథావిధిగా ఈ పథకాన్ని కొనసాగిస్తోంది.

- షాబాద్‌లో పది వేల మందికి పైగా లబ్ధి
- బీమాకు ఆగస్టు 5వ తేదీ వరకు గడువు



తిమ్మారెడ్డిగూడలో సాగులో ఉన్న పత్తి పంట

షాబాద్: వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు రైతు బీమా పథకం చేదోడుగా నిలుస్తుంది. పెద్ద దిక్కుకు అకస్మాత్తుగా జరగకూడనిది ఏదైనా జరిగితే ఆ కుటుంబమంతా రోడ్డున పడుతుంది. ఇలాంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. 2018 ఆగస్టు 14న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రైతు బీమాకు అవసరమైన ప్రీమియం చెల్లించేందుకు నిధులు కేటాయించింది. రైతు బీమా పథకంతో కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు లేదా ఏ ఇతర కారణాల వల్ల మరణిస్తే పది రోజుల్లోనే రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. రైతుపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియం చెల్లించనుంది.

**కొత్త వారికి అవకాశం**

షాబాద్ మండలంలో ప్రస్తుతం రైతు బీమా పథకం కింద అర్హులైన వారు 10 వేల మందికి పైగా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. మండలంలో కొంత మంది రైతులకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. వీరంతా రైతు బీమా పథకం కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ బీమా పథకం కింద అర్హులైన 10 వేల మంది రైతులకు యథావిధిగా ప్రభుత్వమే రెన్యూవల్ చేసి బీమా ప్రీమియాన్ని చెల్లించనుంది. కొత్త పాసుపుస్తకాలు ఉన్న వారితో పాటు మండలంలోని మరికొంత మంది వరకు బీమా పథకం కోసం దరఖాస్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరు కూడా వచ్చే నెల 5వ తేదీలోగా రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. కొత్తగా బీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌ను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలి. అదే విధంగా నామినీ పేరు మార్పు చేయాలనుకునే వారికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

**సద్వినియోగం చేసుకోవాలి**



కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు, గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని వారు వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. –వెంకటేశం, వ్యవసాయశాఖ అధికారి, షాబాద్

# బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

గ్రామస్తుల అభ్యర్థనకు స్పందించిన డీఎం



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండలంలోని ఆలూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని మోహిదీపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మూర్తి గ్రామానికి గతంలో వచ్చే బస్సును పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బస్సు గత కొన్ని రోజులుగా రాకపోవటంతో గ్రామస్తులకు ఇబ్బందిగా ఉందని ఇటీవల కొంతమంది నాయకులు డీఎంకు వినతిపత్రం ఇచ్చారు. తాజాగా సోమవారం మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు డీఎంను కలిశారు. దీంతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతరాములు, కె.నర్సింలు, ఎం.నర్సింలు, శంకరయ్య, సీహెచ్.రాజు, సీహెచ్.నర్సింలు, హైమద్, ఎస్.రాజు, ప్రశాంత్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామానికి నక్షబాట కల్పించండి

- ఎమ్మెల్యే శంకర్‌కు చింతకుంటపల్లివాసుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: గ్రామాన్ని సర్వే చేయించి అధికారిక నక్షబాట ఇప్పించాలని సోమవారం కేశంపేట మండలంలోని చింతకుంటపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చింతకుంటపల్లి గ్రామంలో సుమారు 700 ఎకరాల భూమి ఉందన్నారు. కానీ గ్రామానికి నక్షబాట లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ శివారులో ఉన్న భూములను సమగ్ర సర్వే చేయించి నక్షబాట జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. రెవెన్యూ నక్షబాట లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను రెవెన్యూ శాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరేష్, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పెంటయ్య, అంజయ్య, మల్లేష్, శంకరయ్య, యాదయ్య, బాబర్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

# రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం

కందుకూరు: మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిపై మొరం పోసి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. స్కూల్‌కు వెళ్లే రహదారి వర్షాలతో బురదమయంగా మారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాజీ సర్పంచ్ సోమవారం గ్రామస్తులతో కలిసి ఆ రహదారిపై మొరం పోయించి చదును చేయించాడు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆషాఢ బోనం.. ఘనంగా సమర్పణం



మొయినాబాద్: సురంగల్‌లో కట్టమైసమ్మ బోనాల ఊరేగింపు



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో బోనాలతో బయలుదేరిన మహిళలు

చేవెళ్ల/మొయినాబాద్: ఆషాఢ బోనాల ఉత్సవాలు పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా కొనసాగాయి. మండలంలోని సురంగల్, శ్రీరాంనగర్ తదితర గ్రామాల్లో మైసమ్మ బోనాల ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పుల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపులు చేపట్టారు. మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల్లో యువకులు తొట్టెల ఊరేగింపులు చేపట్టారు. ఉత్సవాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**హైతాబాద్‌లో బోనాల సందడి**

షాబాద్: మండలంలోని హైతాబాద్ గ్రామంలో సోమవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**పోతురాజుల విన్యాసాలు**

చేవెళ్ల మండలంలోని పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రామన్నగూడ, ఊరేళ్ల, ఈర్లపల్లి, తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రజలు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



చేవెళ్ల: ఊరేళ్లలో బోనాల గ్రామోత్సవంలో పాల్గొన్న నాయకులు



షాబాద్: తొట్టెల ఊరేగింపులో నాయకులు



షాబాద్: హైతాబాద్‌లో మాజీ జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



షాబాద్: నాగర్‌గూడ శ్రీచైతన్య పాఠశాలలో బోనాలతో విద్యార్థుల ఊరేగింపు

# ఎస్సీల సమస్యలపై మాట్లాడాలని వినతి



సబితారెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం నగరంలోని ఆమె నివాసంలో కలిసి పలు సమస్యలపై విన్నవించారు. అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందేలా చూడాలని, దళిత బంధు పథకం అమలు చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద నరసింహ, బీఆర్‌ఎస్ నాయకులు యాదన్న పాల్గొన్నారు.

# 31 వరకు వరి నారుమళ్లు పోసుకోండి

ఏఓ రాజు

తలకొండపల్లి: స్వల్పకాలిక వరి నారుమళ్లు పోసుకోవడానికి ఈ నెల 31 వరకు అనువైన సమయమని మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30, 25 రోజుల వయసు ఉన్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాటుకోవాలని తెలిపారు. దీర్ఘకాలిక వరిరకాల నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు ఆకు కొనలు తుంచి, కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలన్నారు. నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా, లేక రెండు దఫాలుగా అంటే 70 శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేసుకోవాలని వివరించారు. వరినాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికల ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15–20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. నాటు పెట్టిన తర్వాత ప్రతిసారి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వలన గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో పాటు సుడిదోమను నివారించవచ్చన్నారు. 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి నాటిన 10,15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు ఉల్లికోడ్‌ను నివారించుకోవచ్చని ఏఓ రైతులకు సూచించారు.

# పదవుల కోసం తీవ్ర పోటీ

- ఆశావహుల నుంచి అభిప్రాయ సేకరణ
- పార్టీ మండల అధ్యక్షుడిగా 14 మంది, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి 8 మంది పోటీ
- వచ్చే నెల 4 లోపు ఎంపిక చేస్తామని కేఎల్లార్ హామీ



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక అంశంపై సోమవారం కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్‌లతో సమావేశమయ్యారు. ఆశావహులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, ప్రశాంత్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, బాల్‌రాజ్, ప్రభునాయక్, సురేందర్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య, రాజు, ప్రవీణ్, రాజు, రవీందర్‌నాయక్‌లు తమకు పార్టీ మండల అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఆశావహులు**

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు ప్రభుత్వం ఇటీవల రిజర్వు చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవీ తమకు ఇవ్వాలని ఆశావహులు పోటీ పడుతున్నారు. ఆశావహుల్లో నేనావత్ రాజునాయక్, అంగోత్ కృష్ణానాయక్, గంగారం పాండు నాయక్, విఠల్‌నాయక్, సేవ్యానాయక్, గోపాల్‌నాయక్, హరిసింగ్, రవీందర్ నాయక్‌లు తమ అభిప్రాయాన్ని ముఖ్యనేతల ముందు వ్యక్తం చేశారు. పోటీ పడుతున్న వారితో పాటు గ్రామ, మండల ముఖ్య నాయకుల అభిప్రాయాలను తీసుకొని అన్ని విధాలుగా అర్హతులున్న సమర్థవంతమైన వారిని పార్టీ మండల అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే నెల 4వ తేదీ వరకు పూర్తవుతుందని స్పష్టం చేశారు.

# పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

తలకొండపల్లి: గత 9 నెలల నుంచి వేతనాలు రాక పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి భిక్షాటన పెంటయ్య చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ఫలితంగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదన్నారు. దీంతో కార్మికుల జీతాల విషయంలో పంచాయతీలు చేతులెత్తేశాయని పేర్కొన్నారు. జనవరిలో పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పాలకవర్గాలు లేవనే కారణంతో ఫిబ్రవరి నుంచి కేంద్రం నిధులివ్వడం లేదని తెలిపారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పారిశుద్ధ్యం.. ప్రత్యేక లోపం



కొందుర్గు పోలీస్‌స్టేషన్ పక్కనే పేరుకుపోయిన చెత్త



ముట్పూర్ వీధుల్లో నిలిచిన వర్షపునీరు

- ఖజానా ఖాళీతో నిలిచిన పనులు
- పట్టించుకోని గ్రామ, మండల ప్రత్యేకాధికారులు

కొందుర్గు: గ్రామాల్లో సర్పంచ్‌లు ఉన్న సమయాల్లోనే అభివృద్ధి పనులు సజావుగా జరిగేవి కాదు. అలాంటిది నాలుగైదు గ్రామాలకు ఓ ప్రత్యేకాధికారి నియమిస్తే గ్రామాల అభివృద్ధి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ఆయారాం–గయారాం అనే రీతిలో వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేబాటలో మండల ప్రత్యేకాధికారులు నడుస్తున్నారు.

**నిధుల లేమితో తిప్పలు**

ప్రత్యేకాధికారుల పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటు పడింది. కనీసం తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టడానికి కూడా నిధులు లేవని అధికారులు చేతులెత్తేస్తున్నారు. కార్మికులకు సంబంధించిన వేతనాలు మాత్రమే వస్తున్నాయన్నారు. నిధుల లేమితో చాలా పనుల ఊసే లేదంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొందుర్గులోని ముట్పూర్‌లో మురుగునీరు ఏరులై పారుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లేడ్ చౌదరిగూడలోని ఎదిరలో రోడ్లన్నీ బురదమయమై నడవడానికి వీలు లేని దుస్థితి నెలకొంది. అనేక గ్రామాల్లో దోమలు, ఈగల బెడద ఎక్కువైంది. కనీసం ఫాగింగ్ చేయలేని స్థితిలో జీపీలున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని గ్రామస్తులు భయాందోళ వ్యక్తం చేస్తున్నారు.

**బాధ్యత తీసుకొని.. వెళ్లిపోయారు**

కొందుర్గు మండల ప్రత్యేకాధికారిగా మార్కెటింగ్ అధికారి రియాజ్‌ను, జిల్లేడ్ చౌదరిగూడ మండల ప్రత్యేకాధికారిగా డీఐఈఓ ఎంక్యానాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిద్దరూ ఈ నెల 4వ తేదీన బాధ్యతలు తీసుకుంటే.. ఇంతవరకు కనిపించలేదని ఆయా మండలవాసులు వాపోతున్నారు. మరోపక్క కొందుర్గు మండలానికి సంబంధించిన ఎంపీడీఓ ఆంజనేయులు జూన్‌లో పదవీ విరమణ పొందారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పశువైద్యాధికారి డాక్టర్ శిరీష బదిలీపై వెళ్లారు. రెండు మండలాల నుంచి దాదాపు 20 మందికి పైగానే పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. కొత్తవారు వచ్చినప్పటికీ ఇంకా పది గ్రామాల వరకు కార్యదర్శులు విధుల్లో చేరలేదు.

**ప్రగతి పడక**



గ్రామాభివృద్ధే.. దేశాభివృద్ధి అని నాయకులు ప్రసంగాలు చేస్తుంటారు. కానీ గ్రామాల ప్రగతికి నిధులు విడుదల చేయకుండా పనులు ఎలా సాగుతాయి. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయ్యి నెలలు గడుస్తున్నా ఎన్నికలు ఇంకా నిర్వహించలేదు. –భిక్షపతి, చలివేంద్రంపల్లి

**నిధులు లేవు**



గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు లేవు. కేవలం గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన వేతనాలకు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. అయినప్పటికీ పారిశుద్ధ్యం లోపించకుండా గ్రామాల్లో తగు చర్యలు తీసుకుంటున్నాం. –ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ జిల్లేడ్ చౌదరిగూడ